టీ వర్క్స్‌లో మేకర్స్ ఫెయిర్

- ఉత్సాహంగా కొత్త వస్తువుల తయారీ
- పాల్గొన్న వందలాది మంది ఔత్సాహికులు

టీ వర్క్స్‌లో ప్రారంభమైన మేకర్స్ ఫెయిర్ హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహికులు

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : భారతదేశంలోనే అతి పెద్ద కార్యక్రమంగా మేకర్స్ ఫెయిర్ హైదరాబాద్‌ను ప్రతి యేటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ వర్క్స్ వేదికగా శనివారం నుంచి మేకర్స్ ఫెయిర్ హైదరాబాద్ వందలాది మంది ఔత్సాహికులతో సందడిగా ప్రారంభమైంది. కొత్త వస్తువులను తయారు చేయాలన్న ఆసక్తి ఉన్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారు తయారు చేసిన వస్తువులు ఆదరణ చూరగొనేలా చేయడమే లక్ష్యంగా మేకర్స్ ఫెయిర్‌ను నగరంలో నిర్వహిస్తున్నారు. దేశంలోని మేకర్స్ కమ్యూనిటీ అంతా ఇందులో పాల్గొనేలా టీ వర్క్స్ చర్యలు చేపట్టింది. దేశంలోనే అతి పెద్ద హార్డ్‌వేర్ ప్రొటో టైపింగ్ సెంటర్‌గా ఉన్న టీ వర్క్స్‌లో తయారీ దారులకు అవసరమైన అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచారు. వివిధ అంశాల్లో కొత్తగా వస్తువులను రూపొందించేందుకు వందలాది మంది ఔత్సాహికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి టీ వర్క్స్‌కు తరలివచ్చారని టీ వర్క్స్ ప్రతినిధి వీర తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో సైన్స్, ఆర్ట్, టెక్, ఫుడ్, డ్రోన్స్, మ్యూజిక్, డూ ఇట్ యువర్ సెల్ఫ్(డిఐవై) వంటి అంశాల్లో ఔత్సాహికులు వస్తువులను తయారు చేసి ప్రదర్శిస్తారని తెలిపారు. కొత్త ఆలోచనలతో వచ్చి, వస్తువు నమూనాను రూపొందించుకొని వెళ్లేందుకు అవసరమైన మౌలిక వసతులు, యంత్ర పరికరాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. మొదటి రోజు 500 మందికి పైగా తయారీదారులు పాల్గొని, 80కిపైగా వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రోన్ రేసింగ్‌ను అందరినీ ఎంతో ఆకట్టుకుందని టీ వర్క్స్ ప్రతినిధి వీర వివరించారు.

కేకేను కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్

ఎంపీ కేకేను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, డిసెంబర్ 16 : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యులు కే.కేశవరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి తనకు కే.కేశవరావుతో అనుబంధం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఇదే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

23న రాష్ట్రీయ గౌరవ్ అవార్డుల ప్రదానం

రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్-2023 కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, నిర్వాహకురాలు సాత్విక గుప్తా తదితరులు

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఈ నెల 23న నగరంలో నిర్వహించనున్న రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్-2023 కార్యక్రమ పోస్టర్‌ను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 40కి పైగా రంగాల నుంచి నిపుణులు, వ్యాపార యజమానులు పాల్గొనేలా చేస్తున్నామని నిర్వాహకుల్లో ఒకరైన సాత్విక గుప్తా తెలిపారు. రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవనంలో రాష్ట్రీయ గౌరవ్ అవార్డుల ప్రదానం ఉంటుందని ఆమె తెలిపారు.

మచ్చబొల్లారంలో ఉచిత వైద్య శిబిరం

వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచ్చబొల్లారం జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జూబ్లీహిల్స్,డిసెంబర్16 : సమాజానికి తిరిగి ఇవ్వాలన్న సంకల్పం సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని వాసవి గ్రూప్ చైర్మన్ ఎర్రం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం తన జన్మదినం సందర్భంగా మచ్చబొల్లారం జడ్పీహెచ్ఎస్‌లో వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, డాక్టర్ సంధ్య, డాక్టర్ యజ్ఞాన్లు పాల్గొని వైద్య సేవలందించారు.

టాడ్ గ్లోబల్ బ్రాండింగ్‌కు పెప్పర్ అవార్డులు

పెప్పర్ అవార్డ్స్‌అందుకుంటున్న టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ ప్రతినిధులు

జూబ్లీహిల్స్, డిసెంబర్ 16 : టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ ప్రతిష్ఠాత్మకమైన పెప్పర్ అవార్డ్స్-2023 లో రెండు విభిన్న అంశాలలో అవార్డులను దక్కించుకున్నది. దేశవ్యాప్తంగా 500కు పైగా ఎంట్రీలు రాగా ఇంటిగ్రేటెడ్ రిటైల్, ఇ-కామర్స్ రంగంలో శనివారం టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. వినూత్న భావనలతో, విశిష్ట వ్యూహాలతో ప్రకటనలు, ల్యాండ్ స్కేపింగ్‌లో టాడ్ గ్లోబల్ బ్రాండింగ్ తనదైన ముద్ర వేసుకుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఉత్సాహంగా జీఎంఆర్ రన్

ఎయిర్‌పోర్టులో రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పాణికర్, తదితరులు

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)/ శంషాబాద్ రూరల్ : జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం 'రన్ రిలాక్స్ అండ్ ఎంజాయ్' థీమ్‌తో నిర్వహించిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ రన్ మూడో ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. 5కే, 10కె రన్‌లో సుమారు 4వేల మంది రన్నర్లు పాల్గొని సందడి చేశారు. ఈ రన్‌ను జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో ప్రదీప్ పాణికర్, సౌత్ అండ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిశోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగర్ శ్రీరాం చంద్ర తన లైవ్ మ్యూజికల్ ప్రదర్శనతో రన్నర్లను ఉత్సాహ పరిచారు.

కూకట్‌పల్లిలో నటి కాజల్ సందడి

ఆభరణాలను ప్రదర్శిస్తున్న నటి కాజల్, తదితరులు

మియాపూర్ , డిసెంబరు 16 : కూకట్‌పల్లిలో అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ సందడి చేసింది. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ బస్టాపు సమీపంలోని పీఎన్ఆర్ వ్యూస్ మాల్‌లో దేవీ పవిత్ర గోల్డెన్ డైమండ్స్ షోరూం ప్రారంభోత్సవంలో కాజల్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాజల్‌తో ఫొటోలు దిగేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ ఎంపీ వేణుగోపాల చారి, కార్పొరేటర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగారావు, దుకాణ నిర్వాహకులు పాల్గొన్నారు.

రియల్ వ్యాపారులకు జవాబుదారితనం తప్పనిసరి

'రెరా' చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ

జూబ్లీహిల్స్, డిసెంబర్ 16 : జాతీయ లెక్కల ప్రకారం సంపాదించిన సొమ్ములో 71 శాతం పొదుపు చేస్తున్న రియల్ ఎస్టేట్ రంగ వ్యాపారులకు పారదర్శకత, జవాబుదారితనం తప్పనిసరని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ అన్నారు. శనివారం నానక్‌రాంగూడ ఐఏయంసీ కేంద్రంలో 'మధ్య వర్తిత్వం-రాజీమార్గం' అంశంపై రెరా అధికారులకు, నారెడ్కో.. క్రెడాయ్.. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఎంపికైన ప్యానెల్ సభ్యులకు ఇంటర్నేషనల్ అర్బిట్రేషన్, మీడియేషన్ రెండురోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెరా అథారిటీ సభ్యులు కె.శ్రీనివాస రావు, జే.లక్ష్మీనారాయణ, అడ్జీడికేటింగ్ అధికారి లతీఫ్ ఉర్ రెహ్మాన్, ఐఏఎంసీ రిజిస్టార్ ఎండి తారాకాన్, రెరీ ఈడి, రిజిస్టార్ ఎస్.సత్తయ్య, పాల్గొని ప్రసింగించారు. కార్యక్రమంలో నరెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రారెడ్డి, క్రెడాయ్ రాజ్ శేఖర్ రెడ్డి, నరెడ్కో జనరల్ సెక్రటరీ విజయ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా టోర్నీకి ఓయూ జట్టు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16 : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికైంది. ఇటీవల మంగళూరు వేదికగా జరిగిన సౌత్‌ఈస్ట్ జోన్ ఫుట్‌బాల్ టోర్నీలో ఓయూ జట్టు నాలుగో స్థానంలో నిలిచి, ఆల్ఇండియా టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. దీంతో 23 ఏండ్ల సుదీర్ఘ విరామం తరువాత ఆల్ ఇండియా టోర్నీకి ఓయూ అర్హత సాధించడం విశేషం. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఓయూ అధికారులు అభినందించారు.

దక్షిణ మధ్య రైల్వేకు అవార్డుల పంట

ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో అవార్డు అందుకుంటున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు

- రెండు ఆల్ ఇండియా ఎఫిషియెన్సీ షీల్డ్స్‌కైవసం
- ఏడుగురు అధికారులకు అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 68వ రైల్వే వీక్ అవార్డ్స్ సెలబ్రేషన్స్‌లో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే(ఎస్‌సీఆర్) తన సత్తా చాటింది. జాతీయ స్థాయిలో రెండు ఆల్ ఇండియా పర్ఫామెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్స్ దక్కించుకుంది. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఢిల్లీలో శనివారం ప్రగతి మైదాన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ఎస్‌సీఆర్‌కు చెందిన డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ డీఎస్ రామారావు, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సీహెచ్. దినేశ్‌రెడ్డి, డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ మల్లేల శ్రీకాంత్, డివిజనల్ సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్ సి. శివకుమార్, ఉమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. ప్రత్యూష, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ టి. నటరాజన్, ట్రాక్ మెంటనర్ వీవీ. రంగయ్యలు అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాలను అందుకున్నారు. గత ఏడాది ఎస్‌సీఆర్ ప్రదర్శించిన అసాధారణ ప్రతిభకు ఈ అవార్డులు వచ్చినట్టు సౌత్ సెంట్రల్ రేల్వే పేర్కొంది. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు చైర్మన్ జయ వర్మ సిన్హా పాల్గొన్నారు.